# నీకోసం ఓ కన్నీటి బొట్టు

## శంఖువరం సరోజా సింధూరి

ఆకాశం నడిబొడ్డున సూర్యుడు...మంటల ముద్దలా.

ఆవేశం అవతలి అంచున నేను...మౌన రాగంలా.

ఆవేశం ఆవిరై, ఆవేదన వరదల్లై ఆలోచనల తీరంలో ఆగిపోయాను.

"పుట్టినరోజుకి కొత్త చీర తేలేదని యింతగా ఏడుస్తున్నావే? అసలు పుట్టిందగ్గర నుంచీ కొత్త చీర ముఖం చూడని దౌర్భాగ్యుల గురించి ఒక్కక్షణం ఆలోచించు...నువ్వెంత సుఖంగా బ్రతుకుతున్నావో తెలిసివస్తుంది"

రాముడి భార్యలా భూమి బ్రద్దలు చేసుకుని పాతాళంలో ఒదిగిపోవాలనిపించింది.

దక్షుడి కూతురిలా నన్ను నేను దహించుకోవాలనిపించింది. కానీ...చురకత్తి విసురులా వున్న సురేష్ మాటల వెనుక ఏదో నగ్నసత్యం కొరడా ఝుళిపింపులావున్న అతని క్రోధం వెనుక మరేదో సృష్టి రహస్యం.

ఒంటరిగా నిలబడ్డాను...నా చుట్టూ ఆలోచనల ఎడారి. నా కంటికి దూరంగా, నా బ్రతుక్కి నిర్వచనంలా ఓ పచ్చని చెట్టు. నిజానికి దగ్గరగా, సురేష్ మాటలకు ప్రతిరూపంలా ఓ ఎండిన బ్రతుకు...కష్టసుఖాల కలయికకు అద్దం పడుతున్నట్టు ఎండపొడలతో నిండిన ఆ వృక్షచ్ఛాయలో అడుక్కు తెచ్చుకున్న అన్నాన్ని అమృతంలా తింటోంది ఓ స్త్రీ

ఆమెను చూశాను నన్ను చూసుకున్నాను

నా దేహం సిమ్లా యాపిల్లా నిగనిగలాడుతూ, గిల్లితే రక్తం వచ్చేట్టు...ఆమె ఒళ్ళు చివికిపోయిన అరటితొక్కలా, కత్తితో పొడిచినా నెత్తురు లేనట్టు

నా కురులు పట్టుదారాల్లా, తుమ్మెద రెక్కల్లా... ఆమె జుట్టు చీకేసిన తాడిపండులా, చుట్టి కొట్టుకున్న ముళ్ళదుబ్బులా.

నా కళ్ళలో కలల కవ్వింతలు. కోర్కెల పువ్వొళ్ళు...ఆ కళ్ళలో కలల అలికిడే లేదు. కోర్కెల ఆనవాలు అసలే లేదు

నా కళ్ళు వెండి వెన్నెల సెలయేళ్ళు... ఆ కన్నీళ్ళు సైతం యింకిపోయిన గాజు గుళ్ళు.

నా బ్రతుకులో వసంత ఋతువులు, కోయిల కుహూ గీతాలు...ఆ బ్రతుకులో శిశిర ఋతువులు, కీచురాళ్ళ వికృత ధ్వనులు.

నా చీరనిండా శతకోటి పూలు...ఆమె చీర నిండా అనంతకోటి చిరుగులు.

గుండె సంద్రంలోంచి ఓ కన్నీటి అల తన్నుకు వచ్చింది నా కళ్ళ తీరంలోకి.

నాకున్నదేదీ ఆమెకు లేదు. ఆమెకు లేని ప్రతిదీ నాకుంది.

దక్షుడి కూతురిలా నన్ను నేను దహించుకోవాలనిపించింది. కానీ.... చురకత్తి విసురులా వున్న సురేష్ మాటల వెనుక ఏదో నగ్నసత్యం. కొరడా ఝుళిపింపులా వున్న అతని క్రోధం వెనుక మరేదో సృష్టి రహస్యం.

కానీ...నాకూ, ఆమెకూ, ఈ ప్రపంచంలోని ప్రతి మనిషికీ ఒకటుంది...

అది మనసే కావచ్చు

* * *

"సారీ మైథిలీ! నిన్నెంతగా బాధపెట్టానో! ఎక్స్ట్రీమ్లీ ఐయామ్ సారీ! నువ్వు మాటిమాటికీ అలా చీరలు కావాలంటుంటే నాకు కోపం వచ్చేసింది. ప్రతినెలా నా జీతంలో సగం నీ చీరలకే ఖర్చయిపోతోంది. ఆ కోపంలో అలా అన్నానే గాని నా చిన్నారి మధుని పుట్టినరోజునాడు కంటతడి పెట్టిస్తున్నానే అని ఆలోచించలేకపోయాను. ఈ దుర్మార్గుడ్ని క్షమించగలవా?" అతని స్వరంలో అనురాగపు అగాధం.

మూగంగా అతని కళ్ళలోకి చూశాను. అతని చూపుల్లో నిర్వచనంలేని ఆర్ద్రత. నాకేమైందో తెలీదు అతన్ని నిలువెల్లా పెనవేసి బావురుమన్నాను.

అతను ఆర్తిగా నా తలను గుండెలకదుముకున్నాడు. "పిచ్చి మధూ! కోపం తగ్గిందా? నీకోసం ఏం తెచ్చానో చూడు?"

"నాకేమొద్దు నువ్వు చాలు" అతని కౌగిలిలో మరింతగా ఒదిగిపోయాను.

"ఎక్సలెంట్...ఎవర్గ్రీన్ డైలాగ్ మధూ. వన్స్మోర్" అతను అల్లరిగా నవ్వాడు.

"ఎందుకు నవ్వుతావ్?" అతని చెంప పగలగొట్టాను ఉడుకుమోత్తనంగా. నా చేతినలాగే చెంపకు చేర్చి పట్టుకుని-

"అమ్మాయిగారి కవిత్వానికి అబ్బాయిగారి బహుమానం యిది. నచ్చుతుందో లేక ఈ చెంప కూడా పగులుతుందో అంతా దేవుడి దయ. ఓ గాడ్ బ్లెస్ మి" ఓ ప్యాకెట్ అందిస్తూ కొంటెగా కన్నుగీటాడు

కందిన బుగ్గలతో అటు చూశాను. అంతే... చకితనయ్యాను పొద్దున అన్ని మాటలని యిప్పుడిలా...ఊహుం...నాకు నమ్మబుద్ధి కాలేదు

""ఏంటి స్వీటీ ఆలోచిస్తున్నావ్? ఈ కఠినాత్ముడి మనసెలా కరిగిందనా? కఠినంగా వుంటేనేకదా కరగటం జరిగేది. కరగటం జరిగితేనే మా దేవేరికి చీరల నైవేద్యం దొరికేది"

అతను మధురంగా నవ్వుతుంటే, గులాబిరంగు కాశ్మీరు శిల్కు రెపరెపలాడుతూ అందాలు చిమ్ముతుంటే, నా జీవితమే సప్తవర్ణాల హరివిల్లులా...నా యిల్లే నింగి దిగిన స్వర్గంలా... నా సురేషే నేను కొలిచే దేవుడిలా అనిపించింది. ఏవేవో వూహలు మల్లెపూల రేకుల్లా...మరేవో మధురస్వప్నాలు విరగబూసిన పారిజాతాల్లా... అనుభూతులు బంగారు పుప్పొడి జల్లులా

కురుస్తుంటే అతని హృదయానికి హత్తుకుపోయాను ఆ క్షణంలో

మరుక్షణం. అస్థిపంజరానికి ఆత్మబంధువులా వున్న ఓ ఆకారం నా కళ్ళముందు నిలిచింది ఉలిక్కిపడి చీరవంక చూశాను

ఈ చీరపైద అందమైన పూలు...ఆ చీర మీద అంతులేని చిరుగులు

*　　　*　　　*

"మైథిలీ! మధూ! హ్యరీఅప్...ఆ చీర వెంటనే ఇటు తీసుకురా' సురేష్ ఆఫీసుకు వెళ్ళిన పది నిముషాల్లో ఇంటికి తిరిగి వచ్చాడు అతని ముఖంలో ఆందోళన. కంఠంలో తడబాటు నేను కిచెన్‌లోంచి వచ్చేసరికే అతను చీరను నేలమీద వేసి సిగార్ లైటర్‌తో అంటించబోతున్నాడు ఒక్క ఉదుటున చీర లాగిపారేశాను.

"సురేష్! మీకు పిచ్చి పట్టింది" ఉద్రేకంతో అరిచాను. నా కళ్ళలో భగ్గుమన్న ఆవేశపు జ్వాల ముందు. అతని సిగరెట్ లైటర్ జ్వాల చప్పున ఆరిపోయింది.

"మధూ! నీకు చెప్పినా అర్థం కాదు దాని త్వరగా ఓ అగ్గిపుల్ల తీసి తగలబెట్టు లేకుంటే అది నా పరువే తగలబెట్టేట్టుంది" అతను బాధగా కణతలు రాచుకున్నాడు

"సరిగ్గా చెప్పండి మీ డ్రమెటిక్ డైలాగ్స్ నాకర్థమే కావట్లేదు' అసహనంగా అన్నాను

"చీరకోసం నీతో దెబ్బలాడి ఆఫీసుకు వెళ్ళానా నా మనసంతా వెలితిగానే వుండి పోయింది లంచ్‌లో రామం నా కొలీగ్ క్లాసవన్ చీరలు. కొంటావేంటా మీ అర్ధాంగికి? అన్నాడు. నువ్వు గుర్తొచ్చావ్. సంతోషంగా ఒప్పుకున్నాను నేనే కాదు మా స్టాఫంతా కొన్నాం ఫుల్ కన్విన్స్ ఇచ్చాడు ఆశ్చర్యపోతున్నా మాకు వాళ్ళ ఫ్రెండ్ బట్టల షాపు ఎత్తేసేసి బొంబే వెళుతున్నాడని సరుకు నష్టమొచ్చినా సరే డిస్పోజ్ అయితే చాలని చెప్పాడు కానీ...రోగ్ వాడు మమ్మల్ని మోసం చేశాడు ఎవడో దొంగతనం చేసినోళ్ళు వేలు ఖరీదు చేసే బట్టలు తెచ్చాట్ట అమ్మి పెడితే సగం వాటా ఇస్తానన్నాట్ట నా కుటుంబ పరిస్థితులు నీకు తెలుసుగదరా కక్కుర్తిపడ్డాను ఆ ఎవడొచ్చి చూడబోయాడులే అనుకున్నాను కాని దొంగ పట్టుబడి నా కొంప కూల్చాడు వాడు పోలీసులకంతా చెప్పాడు పోలీసులు నా ఇంటిని చుట్టుకున్నారు నేనెంత బుకాయించినా వినటం లేదు మీ స్టాఫ్ ఎవరి ఇళ్లలో ఏ చీరా దొరక్కుంటే నీ నిర్దోషిత్వాన్ని నమ్ముతాం అన్నారు ఆ చీరలు దాచేసి నా పరువు ప్రాణం నిలబెట్టండా. వాడు చీరలతో పాటు ఏవో నగలు కూడా నాకే ఇచ్చానని చెప్పాడట ఆ మాట మాత్రం అబద్ధం రా అంటూ ఏడ్చాను. మీదగ్గర చీరలు కనిపిస్తే నగలు కూడా ఉన్నట్టు అనుమానించినా దిక్కులేదు జాగ్రత్త! అని ఓ వార్నింగ్ కూడా పారేశాడు వెధవ యిప్పుడీ చీర పోలీసుల కళ్ళబడిందంటే ఇన్నాళ్ళు నేను బ్రతికిన బ్రతుకంతా వ్యర్థమే ఈ అవమానం కంటే యింత విషం తీని చావటం నయం మధూ!"

సురేష్ మాటలు విని నేను స్తంభించిపోయాను స్తంభించిన నా హృదయంలో ఏదో అలజడి. ఆ అలజడిలో మరేదో ఆలోచన

*　　　*　　　*

బర్త్‌డే పార్టీ జరుగుతోంది ఇన్‌స్పెక్టర్ జయదేవ్ ఇంట్లో. రెండేళ్ల పాపచేత కేకు కోయించాలని ప్రయత్నం చేస్తూ నానా తంటాలు పడుతున్న సుమిత్రను చూడగానే నా కళ్లు క్యూరియాసిటీతో నిండిపోయాయి

సిగార్‌లైటర్ బారి నుండి చీర లాగుతుంటే కుంకుడు గింజంత మేర రంధ్రం పడింది పవిట చెంగుమీద అదే రంగు కాశ్మీరు సిల్కు...అదే మచ్చ...ఆ మనిషి దీన్ని పీల్చుకు అమ్మిందా? ఆమె ఇప్పుడెక్కడ వుంది ఆ రోజునుంచి ఆ మనిషి తనకు కనిపించటం లేదు నేనాగలేక పోయాను పార్టీ ముగిసినాక సుమిత్రనడిగేశాను.

"మిత్రా చీరెక్కడ కొన్నావే"

"బాగుందా?" నవ్వింది.

"ఎంత?"

"చాలా" నవ్వింది మళ్లీ.



"చెబుతావా లేదా ?" నిష్ఠూరంగా అన్నాను సుమిత్ర నా స్నేహితురాలు. మాది ప్రాణ స్నేహితం కాకున్నా మా ఇద్దరి మధ్య రహస్యాలంటూ వుండవ్

"ఇది కొన్నేదే అప్పుడెప్పుడో శారీస్ దొంగతనం జరిగిందట పోలీసు ఇన్వెస్టిగేషన్‌లో చీరలన్నీ బయటపడ్డాయి. వాటిల్లో మావారు యిది ఇంకోటీ పట్టుకొచ్చారు పోలీసు బుద్ధి మరి" గలగల నవ్వింది సుమిత్ర

"ఏయ్ మిత్రా ! ఎంత నీ స్నేహితురాలివైతే మాత్రం నా పరువు తీస్తావటోయ్" జయదేవ్ నవ్వుతూ వచ్చాడు అక్కడకు

"ఈ చీర ఎలాపట్టుబడింది ?" నా గొంతులో ఆరాటం నాకు స్పష్టంగా తెలుస్తోంది

"ఓ ముష్టిది అమ్మటానికి ట్రై చేస్తూ పట్టుబడింది. ఎక్కడిదే ఈ చీరంటే ఓ పట్టాన చెప్పదు ఎందుకులెండి ఆ గొడవంతా" అతను ఆగాడు

"వినాలనుంది. చెప్పండి" పాలిపోయిన ముఖంతో అడిగాను.

"చెప్పమంటారా" అతను నవ్వి మొదలెట్టాడు మళ్ళీ "ఎక్కడిదే అంటే ఓ పట్టాన చెప్పలేదండీ నాకు వళ్ళుమండి ఒక్కటిచ్చుకున్నాను. అప్పటికి నోరు విప్పింది"

నేను ఉలికిపడి సర్దుకున్నాను.

"ఈ చీర నేను మాత్రం దొంగతనం చెయ్యలేదు బాబూ ఓ అమ్మ నాకు దానం చేసిందన్నది. ఆ అమ్మ పేరు చెప్పవే అమ్మతల్లీ అని మరోటిచ్చాను" అతను ఆగి కను చివరలనుంచి ఎటో చూశాడు నా గుండెజారి పోయింది. గిల్టీగా ఫీలయ్యాను

"ఏం చెప్పిందేంటి ?" ఎంత వద్దన్నా సురేష్ స్వరంలో కంగారు

"కవిత్వం" అతను పెద్దగా నవ్వాడు నవ్వి అన్నాడు. "ఆ అమ్మ తెలిసో తెలియకో దొంగ సొమ్ము కొన్నది. అది సమస్య అయి కూర్చుంది వదిలించుకోవాలనుకుంది నన్ను చూసి జాలి పడింది ఆ చీర నాకిచ్చింది. తనపేరు చెప్పవద్దని ఒట్టేయించుకుంది ఆ దేవతకి అన్యాయం చెయ్యలేను అంది నాకు నవ్వొచ్చిందంటే నమ్మండి సురేష్ ఆదేవత్తో దొంగ సొమ్ము వదిలించుకోటానికి ఆ పాపం దీనికి అంటగడితే యిదేమో దాన్ని దేవతను చేసి గుళ్ళో కూర్చోబెడుతోంది ఆ మాటే అడిగాను. అదేమందో తెలుసా ? అబ్బ! అది చచ్చినా ఆ మాట మాత్రం ఎవర్ గ్రీనండీ ఏ రచయితకీ ఆ ఛాట్ రాదేమో కూడా" అతను సిగార్ పొగ గుప్పు గుప్పున వదిలాడు

"ఆమె చనిపోయిందా ?" నేను ఉక్కిరి బిక్కిరయ్యాను

అతినదేం పట్టించుకోలేదు "కోట్ చేసుకోవాల్సిన మాటలండీ బాబూ ఆ తల్లి స్వార్థపరురాలైతే ఈ చీర తన బంధువుల కిచ్చుకోవచ్చు లేదా ఎక్కడైనా దాచి ఈ గొడవ తగ్గినాక తెచ్చుకోవచ్చు కానీ ఆమె నాకిచ్చేసింది. వందలు విలువచేసే చీర నాకిచ్చేసింది. అది త్యాగం కాదా! ఒకవేళ ఆమె స్వార్థంతోనే భయంతోనే అది నాకిచ్చి వుండొచ్చు కాని ఆ స్వార్థాన్ని మించిన



## సలహా

ముత్యాలరావు ముసలాడైనా స్త్రీ వాంఛ పోలేదు. మిత్రుడ్ని సలహా అడిగాడు.

"రవ్వలాంటి పిల్లను చూశా. పెళ్ళి చేసుకోవాలనుంది. నేను డబ్బుగలవాడినని ఆ పిల్లకు తెలుసు. రేపు నా వయసు అడిగితే అరవై అని నిజం చెప్పమంటావా, లేక ఓ పదేళ్ళు తగ్గించి చెప్పమంటావా?"

"రెండూ వద్దు: ఎనభై అనిచెప్పు. అలా చెబితే నువు త్వరగా పోతావనీ, ఆస్తి దక్కుతుందనీ ఆ క్షణం ఆపిల్ల వప్పుకుంటుంది" సలహా ఇచ్చాడు మిత్రుడు

-సుత్రిశ్రీ (నిడదవోలు)


త్యాగం, ఆ భయాన్ని మించిన జాలీ ఆమెలో వున్నాయ్ ఆ గొప్పతనాన్ని చూసి ఆ కొంచెం స్వార్థాన్ని క్షమించెయ్యొద్దు యింతె. దుకు నువ్వు నాకు చూస్తూ చూస్తూ ఓ పది రూపాయలు యివ్వగలవా ? అది దొంగ సొమ్మయినా సరే కాల్చి అవతల పారేస్తావ్‌గాని నాలాంటి ముష్టి దానికిస్తావా ? అన్నదండీ నిజంగా దాని వాగ్ధాటికి ఆశ్చర్యపోయాను నువ్వు ముష్టిదానివా లేక డైలాగ్ రైటర్‌వా అన్నాను

"బ్రతుక్కు ముష్టిదాన్ని అయినా బుద్ధికి మాత్రంకాదు" అన్నది నాకు వళ్ళు మండిపోయింది దాని నిర్లక్ష్యానికి, యూ బ్లడీ బిచ్... షట్ యువర్ బ్లడీమౌత్ అని అరిచేశాను కాని స్టేబుల్ నాకోపంచూసి లాగిపెట్టేతన్నాడు దాని గుండెలమీద కదలూ... కవిత్వాలు కట్టిపెట్టి నిజం కక్కవే అంటూ ఆ సెంటిమెంటల్‌ఫూల్ నిజంకక్కలేదు రక్తం కక్కింది. మేం భయపడిపోయాం. అంబులెన్స్‌లో ఎక్కిస్తుంటేనే ప్రాణం పోయింది పోస్టుమార్టమ్‌లో దానికి బ్లడ్ కేన్సర్ అని తేలింది. మై గడ్‌నెస్ ! ఆ ప్రాణం పోవటానికి నేను కారణం కాలేదు

జయదేవ్ మాటలు నాకు వినిపించటంలేదు నేనేమైపోతున్నానో నాకే తెలీదు! ఎప్పుడు సురేష్ నన్ను యింటికి తీసుకువచ్చాడో నాకు తెలీదు, తెలిసేసరికి నేనతని బాహువుల్లో యిమిడిపోయి వెక్కిపడుతున్నాను

"మధూ ! ఎక్కడిదానివి నువ్వు ? మరి

పోయింది. —బ్నిం.



# ఒకసారి ఏమయిందంటే....


## బివేర్ ఆఫ్...

నేను ఎమ్మెస్సీ చదివే రోజుల్లో 1978 లో బొటానికల్ టూరు నిమిత్తం నార్త్ ఇండియా వెళుతున్నాము. మేము చదివేది మహారాష్ట్రలో కాబట్టి మా బాచ్‌లో మరాఠీ, తెలుగు, హిందీ మూడు భాషలూ వినిపిస్తున్నాయి.

తిరుగు ప్రయాణంలో భోపాల్ దాటాక సూటు బూటులోవున్న ఆజానుబాహుడు మధ్య వయస్కుడు మా మధ్యకొచ్చి కూర్చున్నాడు. తను డా. శ్రీవాత్సవ అనీ, భోపాల్ లా కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాననీ చెప్పాడు.

ఇంతలో ఇటార్సీ స్టేషన్ వచ్చింది. సమయం రాత్రి పదన్నర అయింది. శ్రీవాత్సవ మాకు కాఫీ ఆఫర్ చేశాడు. మా బాచ్‌లో అంతా నిద్రపోతున్నారు. నేను, మా రూమ్మేటు, ఇద్దరు గరల్ స్టూడెంట్సు దిగి కంపార్టుమెంటు ఎదురుగా వున్న కొట్టుదగ్గర శ్రీ వాత్సవతో కాఫీ తాగుతూ ముచ్చటిస్తున్నాము.

అతను కంపార్టుమెంటులో కొచ్చి తను మలేషియా, లండన్‌లలో పి.హెచ్.డి. చేశాననీ అక్కడి ప్రజల ఆచారాలు వగైరా ధారాళమైన ఆంగ్లంలో సుత్తికొట్టాడు. ఓ పావుగంట తరువాత తాను ఛత్రీస్‌ఘడ్ వెళ్ళాలనీ, తన బండి సిద్ధంగా ఉందనీ, చెప్పి మా దగ్గర సెలవు తీసుకున్నాడు




ఆ తర్వాత మేము కంపార్టుమెంటులోకి వెళ్లాము. ఇంతలో మా తోటి అమ్మాయి తన హేండ్‌బాగ్ కనపడ్డంలేదని గొడవ చేసింది. మెల్లిగా నా సూట్‌కేసు కూడా మాయమైనట్టు గ్రహించాను. నా గుండె ఆగినంత పనైంది. దాంట్లో నావి, మా రూమ్మేటువి బట్టలు, డబ్బు వాచీ అన్నీ వున్నాయి

వెంటనే ప్లాట్‌ఫాం, ట్రెయిన్, ఛత్రీస్‌ఘడ్ వెళ్ళే బండి అన్నీ గాలించాము. పోలీసు రిపోర్టు కూడా ఇచ్చాము. ఆ శ్రీవాత్సవ గాని, సామానుగాని ఎక్కడా ఆచూకీ లేదు. ఆ స్టేషన్‌లో దొంగతనాలు మామూలేనని పోలీసువాళ్ళు అన్నారు.

మేము తిరిగివచ్చాక భోపాల్ లా కాలేజీ ప్రిన్సిపాల్‌కు రాసి కనుక్కుంటే అక్కడ శ్రీ వాత్సవ అనే పేరుగల వ్యక్తి ఎవరూ లేరని తెలిసింది. ఈ సంఘటన మా జీవితాల్లో "జాగర్త" అనే పదాన్ని చేర్చింది. మా స్నేహితులెవరైనా ప్రయాణమై వెళుతూంటే 'బీ వేర్ ఆఫ్ శ్రీ వాత్సవ' అని వార్నింగు ఇచ్చుకోడం రివాజైపోయింది.

— డి. సంతోష్ కుమార్

(ఖమ్మం) ❋

---

యింత సెన్సిటివ్ అయితే ఎలా?" సురేష్ అనునయిస్తున్నాడు.

"సురేష్, నేనెంత నీచురాల్ని! ఎంతటి స్వార్థపరురాల్ని! ఆరోజు నువ్వా చీర కాల్చేస్తున్నావని బాధపడ్డానేగాని... నేనో బ్రతుకునే కాల్చివేస్తాననుకోలేదు. అప్పుడు నాకది పెద్ద త్యాగంలా అనిపించింది. మహారాజులు అగ్రహారాలు దానం చేస్తున్నంత గర్వంగా ఆమెకది యిచ్చాను. నావాళ్ళకివ్వకుండా ఓ దీనురాలికి యిస్తున్నానే అని పొంగిపోయాను. కానీ...కాని అది దొంగసొమ్ము కాకుంటే వేసిచ్చేదాన్నా! అది ఆమె మీద జాలేనా? కాదు నా పరువుపోతుందనే భయం. ఆ పిచ్చిది నా స్వార్థాన్ని త్యాగంగా చిత్రించుకుందే... భగవాన్!"

"రిలాక్స్ మధూ! డోంట్ బి ఎక్సైటెడ్ పర్‌గెటిట్" అతని ఓదార్పు వినే స్థితిలో లేను.

"చూడండి సురేష్ ఆ యిన్‌స్పెక్టర్ ఏమన్నాడో! ఆమె సెంటిమెంటల్ ఫూలట చూడు ఈలోకం మంచితనానికి యిచ్చిన బిరుదు ఎంత బాగుందో"

నేనతని కళ్ళలోకి చూశాను. అతను ఆప్యాయంగా నా తల నిమిరాడు

"ఎక్కడ పుట్టిందో? ఎక్కడ పెరిగిందో? నాకిచ్చిన మాటకోసం తన ప్రాణాన్నే బలిదానం చేసింది. ఆ త్యాగానికి నేనేమివ్వగలను ఓ కన్నీటిబొట్టుతప్ప" ఉద్వేగంతో నాగుండెలు అదురుతున్నాయి.

నా కన్నీటికి నోరుంటే కోటిగొంతులతో ఎలుగెత్తి చాటేదే ఆ త్యాగమూర్తికి జరిగిన అన్యాయాన్ని ❋